# ఉద్యాన పంటల సాగు.. బిందు సేద్యంతో బాగు

**ఎకానమీ**



గ్రూప్స్ ప్రత్యేకం
ఎకానమీ

**సంప్రదాయ పంటల సాగుతో లాభాల మాట అటుంచితే నష్టాలే ఎక్కువ అనడంలో సందేహం లేదు. అనాదిగా రైతులు ఇదే బాటలో నడుస్తున్నారు. మొఘల్ కాలంలోనే ఉద్యాన పంటల సాగుకు ఎంతో ప్రత్యేకత, ప్రాముఖ్యత ఉండేది. వీటితో లాభాలే కాకుండా మనకు పోషకాహారం కూడా అందుతుంది. రైతులు ఉద్యాన పంటలకు ప్రాధాన్యమివ్వాల్సిన తరుణమిదే. ఉద్యాన పంటల సాగు, వాటి లాభనష్టాలను తెలుసుకుందాం.**

**ఉద్యాన పంటల అభివృద్ధి-సమస్యలు**

- వ్యవసాయరంగ కార్యక్రమాల్లో ఉద్యాన పంటల సాగు ఒక ప్రత్యేక అనుబంధ విభాగం. మానవుడు తన ఆహార, వైద్య, సౌందర్య సంతృప్తి కోసం ప్రత్యక్షంగా ఉపయోగించే మొక్కల సాగుకు సంబంధించిందే ఉద్యాన పంటల పెంపకం కార్యక్రమం.
- మానవుడు వినియోగించే పండ్లు, కూరగాయలు, పూలు, మూలికలు, అలంకార, అనేక మొక్కల సాగు, ఉత్పత్తి, అమ్మకం వంటివి ఉద్యాన పంటల పెంపకం కిందకు వస్తాయి. ఉద్యాన పంటలను ప్రధానంగా ఐదు రకాలుగా విభజించారు.

**1. పండ్ల తోటలు**
- మామిడి, జామ, బత్తాయి, పైనాపిల్, Nut fruitsను పండించి కోసి, నిల్వ చేసి, ప్రాసెసింగ్ చేసి అమ్మకం చేయడాన్ని పోమోలజీ అంటారు.

**2. కూరగాయ తోటలు**
- వంకాయ, బెండకాయ, గుమ్మడి, టమాట వంటి కూరగాయలను పండించడాన్ని Olericulture అంటారు.

**3. మొక్క తోటలు**
- మొక్కలు, పొదలు, కాఫీ, టీ, రబ్బరు, కొబ్బరి వంటి వాటిని ప్లాంటేషన్ క్రాప్స్ అంటారు.

**4. అలంకార, ప్రకృతి శోభ పంటలు:**
**ఇవి రెండు రకాలు**

ఎ. **పూల తోటల పెంపకం:** బంతి, చేమంతి, మల్లె, జాజి వంటి పూల పెంపకం.

బి. **ప్రకృతి వ్యవసాయం:** అన్ని ప్రాంగణాలను అందంగా అలంకరించడానికి ఉపయోగించే మొక్కలు, గుబుర్లు వంటి వాటి పెంపకం.

**5. సుగంధ ద్రవ్యాలు**
- రుచి, సువాసన కోసం వంటల్లో వేసే యాలకులు, లవంగాలు, మిరియాలు, పసుపు, అల్లం, కారం, ఉల్లి, వెల్లుల్లి వంటి వాటి పెంపకం.
- ఔషధాల తయారీలో ఉపయోగించే మూలికలు, మొక్కలు, సర్పగంధ, అశ్వగంధ, తులసి వంటి మొక్కల పెంపకం.

**ఉద్యాన పంటల ప్రాముఖ్యత**
- ఆహార ధాన్యాల దిగుబడి కంటే ఉద్యాన పంటలైన అరటి, ద్రాక్ష వంటివి అధిక దిగుబడులనిస్తాయి.
- ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు అనేక పోషకాలు, విటమిన్లు ఫైబర్ కలిగి ఉండి మానవులకు సంతులిత ఆహారాన్ని అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- ఈ రంగంలో పండించే పంటల ఉత్పత్తి చిన్న సన్నకారు రైతులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, ఆదాయాన్ని కూడా పెంచుతాయి.
- వ్యవసాయ పంటల వలె కాకుండా ఉద్యాన పంటలైన పండ్లు, మొక్క తోటలు వాలుగా ఉన్న భూముల్లో కూడా పండించవచ్చు. మామిడి, జీడిపప్పు లాంటివి కొండ ప్రాంతాల్లో, కొండ వెనుక ప్రాంతాల్లోను పండించవచ్చు.
- ఈ పంటల సాగులో శ్రామిక శక్తిని ఉపయోగిస్తే ఎక్కువ మందికి ఉపాధి, అదనపు ఆదాయం లభిస్తాయి.
- ఉద్యాన పంటలు అనేక రకాలైన మందుల తయారీ ఫుడ్ ప్రాసెసింగ్ సువాసన, సౌందర్య పెంపు ఉత్పత్తుల పరిశ్రమలకు ముడిసరకుగా ఉపయోగపడుతున్నాయి.
- ఈ పంటలు తక్కువ నీటితో, బిందు సేద్యం పద్ధతిలో పండించడం వల్ల నీటి వినియోగం తక్కువ ఉంటుంది. అంతేగాక రైతు పంట నష్టం బారిన పడకుండా కాపాడుతుంది.
- ఉద్యాన క్షేత్రాల్లో బహుళ పంటలు వేయడం వల్ల వ్యయం కూడా తక్కువగా ఉంటుంది.
- ఉద్యాన పంటలకు జాతీయ, అంతర్జాతీయ డిమాండ్ ఉంటుంది. కాబట్టి ఎగుమతులు పెరిగి విదేశీ మారక ద్రవ్యం పొందడానికి వీలుంటుంది.

**భారతదేశంలో ఉద్యాన పంటల సాగు**
- మొఘల్ పరిపాలనలో ఉద్యాన పంటలకు అధిక ప్రాముఖ్యత ఉండేది. 1820లో రెవరెండ్ విలియం కేరీ అనే ఆంగ్లేయ మిషనరీ భారతీయ అగ్రి-హార్టికల్చర్ సంఘాన్ని నెలకొల్పాడు. దాని ద్వారా అనేక రకాల కూరగాయలను, పండ్లను ఈ దేశంలో ప్రవేశపెట్టారు. కర్ణాటక ఉద్యాన పంటల శాఖ సంచాలకుడిగా పని చేసిన డా.ఎం.హెచ్.మారిగౌడ దేశంలో ఉద్యాన పంటల అభివృద్ధికి ఎక్కువగా కృషి చేశారు. ఆయనను భారతదేశ ఉద్యాన పంటల పితామహుడిగా పిలుస్తారు.
- దేశంలో 1966-68 మధ్య సాధించిన హరిత విప్లవం ఫలితంగా అన్ని రకాల పంటల దిగుబడులు పెరిగాయి. కొత్త వంగడాల వాడకంతో పంటల ఉత్పత్తి పెరగడంతో ఉద్యానపంటల సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. 1970 నుంచి దేశంలో ఉద్యాన పంటల సాగు మొదలైంది. నాలుగో పంచవర్ష ప్రణాళికలో కూడా మొదటిసారి నిధులు కేటాయించి ఉద్యాన పంటలను ప్రోత్సహించారు. అయినా ఏడో పంచవర్ష ప్రణాళిక కాలం నుంచే ఉద్యాన పంటల సాగుకు ప్రాధ్యాన్యం, గుర్తింపు లభించాయి.
- దేశంలో విభిన్న వ్యవసాయ వాతావరణ పరిస్థితి ఉద్యానవన పంటల సాగుకు అనుకూలిస్తాయని గ్రహించి ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో ఉద్యాన పంటల సాగుకు ఎక్కువ నిధులు కేటాయించి, తర్వాత పంచవర్ష ప్రణాళికలో దాని ప్రాధ్యాన్యతను కొనసాగించారు.
- భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖలోని వ్యవసాయ, సహకార డిపార్ట్‌మెంట్ ఉద్యాన పంటల సాగు, పురోగతిని పర్యవేక్షిస్తుంది. పంటల విభాగం నుంచి ఉద్యాన పంటల విభాగాన్ని 1981లో వేరు చేశారు. ప్రభుత్వం సమర్థవంతమైన భూ వినియోగం, అభిలషణీయమైన వనరుల ఉపయోగం, నైపుణ్య శ్రామికుల ఉద్యోగిత అంశాలపై శ్రద్ధ వహించి పండ్లతోటలు, కూరగాయలు, మొక్కల పెంపకం వంటి వాటిని ప్రోత్సహించింది.
- కొబ్బరి అభివృద్ధి బోర్డు-2006లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ నాగాలాండ్‌లో ఏర్పాటు చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులకు, రైతులకు శిక్షణ ఇవ్వడం, నర్సరీల ఏర్పాటును ప్రోత్సహించడం, ఉద్యాన పంటల సర్టిఫికెట్ కోర్సులు నడపడం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం మొదలైనవి ఈ సంస్థ కార్యక్రమాలు.
- ఉద్యాన పంటల వృద్ధి కోసం ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన 'Group on Perishable Agriculture Commodities' చేసిన సిఫారసు మేరకు 1984లో నేషనల్ హార్టికల్చర్ బోర్డు (ఎన్‌హెచ్‌బీ) హర్యానాలోని గురుగ్రాంలో నెలకొల్పారు. ఉద్యాన పంటల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పండ్లు, కూరగాయల ఉత్పత్తి, ఉత్పాదకత వృద్ధి చేసే ప్రయత్నాలు చేశారు.
- భారత వైద్య పరిశోధన మండలి సిఫారసుల ప్రకారం రోజుకు తలసరి పండ్ల వినియోగం 92 గ్రా. కూరగాయల వినియోగం 300 గ్రా. ఉండాలి. దేశంలో రోజుకు పండ్ల వినియోగం 46 గ్రా. కూరగాయల వినియోగం 130 గ్రా. ఉంది. కాబట్టి ఉద్యానపంటల అభివృద్ధి ఆవశ్యకతను గుర్తించి హార్టికల్చర్ పంటల ఉత్పత్తి పెంచడానికి ప్రభుత్వం కొన్ని ప్రత్యేక చర్యలను ప్రోత్సహించింది. అందులో ముఖ్యమనవి పండ్ల తోటలు పెంచే ప్రాంతాల్లోని రైతులను సహకార పద్ధతిలో సమీకరించి నర్సరీలు పెంచి, తెగుళ్లను నియంత్రించి, మార్కెటింగ్ సౌకర్యాలు పెంచడం.
- సహకార పద్ధతిలో పట్టణ శివార్లలో పండ్లు, కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించి, మార్కెటింగ్ చేయడం.
- ఉత్పత్తి చేసిన పండ్లు, కూరగాయల నిల్వకు శీతల గిడ్డంగులను ఏర్పరచడం.
- హార్టికల్చర్ పంటల వృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖ అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసింది. జాతీయ హార్టికల్చర్ మిషన్ స్థాపించడం, ఈశాన్య హార్టికల్చర్ సంఘటిత అభివృద్ధికి టెక్నాలజీ మిషన్ స్థాపించడం, జాతీయ హార్టికల్చర్ బోర్డు ద్వారా మూలధన పెట్టుబడి సబ్సిడీ అందించడం, టెక్నాలజీ మిషన్ ద్వారా సంఘటితంగా కొబ్బరి తోటలను అభివృద్ధి చేయడం వంటి చర్యలు హార్టికల్చర్ అభివృద్ధికి ఉపయోగపడ్డాయి.
- సూక్ష్మ వ్యవసాయం, జాతీయ వెదురు మిషన్, నాగాలాండ్‌లో కేంద్రీయ హార్టికల్చర్ సంస్థను స్థాపించడం ద్వారా హార్టికల్చర్ అభివృద్ధికి గట్టి ప్రయత్నాలు జరిగాయి.

## జాతీయ ఉద్యాన పంటల మిషన్

- ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ 2005, మే 19న ఆమోదించిన జాతీయ హార్టికల్చర్ మిషన్ 2005-06 నుంచి పని చేయడం ప్రారంభించింది. తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక కాలంలో ఈశాన్య రాష్ట్రాలైన సిక్కిం, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో హార్టికల్చర్ సంఘటిత అభివృద్ధికి టెక్నాలజీ మిషన్ ద్వారా పథకాలు అమలు చేశారు. 10వ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఈ పథకాన్ని కొనసాగించి రూ.845 కోట్ల వ్యయంతో 11 రాష్ట్రాల్లో హార్టికల్చర్ పంటల అభివృద్ధి పథకాలు చేపట్టారు.
- 2005-06లో దేశ స్థూల పంటల విస్తీర్ణంలో 13.0 శాతంలో హార్టికల్చర్ పంటలు పండించి, 177.41 మి.టన్నుల ఉత్పత్తి సాధించారు. 5.34 మి. హెక్టార్లలో పండించిన పండ్ల ఉత్పత్తి 52.85 మి.టన్నులుగా అంచనా వేశారు. అలాగే 17.05 మి.హెక్టార్లలో 108.20 మి.ట కూరగాయలు పండించారు. ప్రపంచ దేశాల్లో చైనా తర్వాత అత్యధికంగా పండ్లు, కూరగాయలు పండించింది భారతదేశమే. అరటి, మామిడి, నిమ్మ, బొప్పాయి, ఓక్రా పంటల్లో ప్రపంచంలో భారత్‌ది ప్రథమ స్థానం.
- 2006-07లో జాతీయ హార్టికల్చర్ మిషన్ ద్వారా పండ్లు, కూరగాయల ఉత్పత్తుల పెంపుదల పథకాన్ని 18 రాష్ట్రాల్లో రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలు చేసిన మొత్తం 259 జిల్లాలకు విస్తరించారు. ఈ పథకాలు జాతీయ స్థాయి సంస్థలైన జాతీయ హార్టికల్చర్ పరిశోధన, అభివృద్ధి ఫౌండేషన్, జాతీయ విత్తన సంస్థ, భారతదేశ రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ ద్వారా కూరగాయల విత్తనాల నాణ్యతను పెంపొందించి కూరగాయల ఉత్పత్తికి చర్యలు చేపట్టారు.
- టెక్నాలజీ మిషన్ పథకం కింద రాష్ట్రాలకు హార్టికల్చర్ పంటల వృద్ధికి రూ.278.40 కోట్లు కేటాయించారు.
- 11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో జాతీయ హార్టికల్చర్ మిషన్ ద్వారా 18 రాష్ట్రాల్లో, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో సంపూర్ణ హార్టికల్చర్ అభివృద్ధి పనులు చేపట్టారు. దేశంలో 16.7 లక్షల హెక్టార్ల భూమి పండ్లు, కూరగాయల పెంపకం కిందకు తెచ్చారు.
- 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో (2012-15) పండ్లు కూరగాయల ఉత్పత్తి 10.0 శాతం పెరిగింది. 24.47 మిలియన్ హెక్టార్లలో 286.2 మిలియన్ టన్నుల పండ్లు కూరగాయలు ఉత్పత్తి అయ్యాయి. ఈ కారణంగా వ్యవసాయ రంగ వృద్ధిలో హార్టికల్చర్ ప్రాముఖ్యతను సంపాదించుకుంది. శీతల గిడ్డంగులు, మార్కెటింగ్ సౌకర్యాలు విస్తృత పరిచి Farmer Producer Organisation, Farmer Interest groups ఏర్పాటు చేసి హార్టికల్చర్ రంగ అభివృద్ధికి కృషి చేశారు.

**భారత ఆర్థిక సర్వే 2022-23**
- మూడో ముందస్తు అంచనాల ప్రకారం 28.0 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో 342.3 మిలియన్ టన్నుల రికార్డు ఉత్పత్తిని సాధించారు.
- ప్రభుత్వ 55 హార్టికల్చర్ క్లస్టర్లను గుర్తించగా అందులో 12 క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పైలట్ దశకు ఎంపిక చేసింది. ఈ కార్యక్రమం హార్టికల్చర్ క్లస్టర్ల భౌగోళిక ప్రత్యేకతను ప్రభావితం చేయడానికి, మొత్తం సరఫరా గొలుసుతో సహా ప్రీ-ప్రొడక్షన్, ప్రొడక్షన్, హార్వెస్ట్ కార్యకలాపాల సమగ్ర, మార్కెట్ నేతృత్వంలోని అభివృద్ధిని ప్రోత్సహించడానికి రూపొందించారు.

జీనియస్ పబ్లికేషన్ సౌజన్యంతో...

**విద్య, ఉద్యోగ సమాచారం**

### బామర్ లారీ లిమిటెడ్‌లో..

**కోల్‌కతాలోని ప్రభుత్వ రంగ సంస్థ బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్ ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- మొత్తం ఖాళీలు: 4
- **పోస్టులు:** జూనియర్ ఆఫీసర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్), జూనియర్ ఆఫీసర్
- **అర్హత:** ఏదైనా డిగ్రీ
- వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు
- ఎంపిక: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 4
- **వెబ్‌సైట్:** http:// balmerlawrie.com/feedback

### ఎన్ఐటీఎంలో..

**ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)కు చెందిన కర్ణాటక, బెళగావిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్ (ఎన్ఐటీఎం) తాత్కాలిక ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టులు:** టెక్నికల్ అసిస్టెంట్
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరి తేదీ:** అక్టోబర్ 18
- **వెబ్‌సైట్:** https://icmrnitm.res.in

Email id: rect.nitm@gmail.com

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

**పోటీ పరీక్షల ప్రత్యేకం**
- గ్రూప్స్ ప్రత్యేకం : కరెంట్ అఫైర్స్, చరిత్ర బిట్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# తిరుపతిలో లడ్డూను నైవేద్యంగా ఎప్పటి నుంచి ప్రారంభించారు?

పోటీ పరీక్షల ప్రత్యేకం
**కరెంట్ అఫైర్స్**



**1. జమిలి ఎన్నికలకు సంబంధించిన వాక్యాల్లో సరైనవి ఏవి?**
1. జమిలి ఎన్నికలు అంటే లోక్‌సభకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం
2. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కోసం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 2023, సెప్టెంబర్ 2న 8 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు
3. జమిలి ఎన్నికల కోసం కోవింద్ కమిటీ 7 దేశాల్లో అధ్యయనం చేసింది
4. జమిలి ఎన్నికలపై 2024, మార్చి 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు 18,629 పేజీల నివేదికను అందజేసింది
ఎ) 2, 3, 4 బి) 1, 2, 4
సి) 1, 3, 4 డి) 1, 2, 3, 4

**2. కింది వాక్యాల్లో సరైనవి ఏవి?**
1. జమిలి ఎన్నికల నిర్వహణకు రామ్‌నాథ్ కోవింద్ కమిటీ రెండంచెల విధానాన్ని సూచించింది
2. తొలుత లోక్‌సభకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించాలి
3. 100 రోజుల వ్యవధిలో మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి
4. మూడు స్థాయిల్లో నిర్వహించే ఎన్నికలకు ఉమ్మడి ఓటర్ల జాబితాను రూపొందించాలి
ఎ) 1, 2, 3, 4 2) 1, 3, 4
సి) 1, 2, 4 డి) 2, 3, 4

**3. తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డూ నైవేద్యానికి సంబంధించి సరైనవి?**
ఎ) లడ్డూను నైవేద్యంగా 1715, ఆగస్ట్ 2న ప్రారంభించారు
బి) తి.తి.దే లడ్డూపై 2009లో పేటెంట్ హక్కు పొందింది
సి) ఎ డి) ఎ, బి

**4. కింది వాక్యాల్లో సరైనవి ఏవి?**
1. ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆతిశీ సెప్టెంబర్ 21న ప్రమాణ స్వీకారం చేశారు
2. ఢిల్లీ మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆమె నిలిచారు
3. దేశంలో 17వ మహిళా ముఖ్యమంత్రిగా ఉన్నారు
4. ప్రస్తుతం పదవిలో ఉన్న మహిళా ముఖ్యమంత్రుల్లో ఆతిశీ, మమతా బెనర్జీ తర్వాత రెండో మహిళ
ఎ) 2, 3, 4 బి) 1, 2, 4
సి) 1, 3, 4 డి) 1, 2, 3, 4

**5. కింది వాక్యాల్లో సరైనవి ఏవి?**
ఎ) భారతదేశంలో మొదటి మహిళా ముఖ్యమంత్రి సుచేత కృపలాని (ఉత్తరప్రదేశ్)
బి) మహిళా ముఖ్యమంత్రుల్లో అత్యధిక కాలం పనిచేసింది షీలా దీక్షిత్ (ఢిల్లీ)
సి) మహిళా ముఖ్యమంత్రుల్లో అత్యల్ప కాలం పనిచేసింది వీఎన్ జానకీ రామచంద్రన్ (తమిళనాడు). 23 రోజులు
డి) పైవన్నీ సరైనవే

**6. కింది వాక్యాల్లో సరైనవి ఏవి?**
1. శ్రీలంక 9వ అధ్యక్షుడిగా అనుర కుమార దిసనాయక గెలుపొందాడు
2. ఈయన 'జనతా విముక్తి పెరుమున' పార్టీకి అధినేత
3. ఈ ఎన్నికల్లో తొలిసారి ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో విజేతను ప్రకటించారు
4. శ్రీలంక సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జయంత్ జయసూరియా అనుర కుమార దిసనాయక (56)తో శ్రీలంక అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు
ఎ) 2, 3, 4 బి) 1, 2, 4
సి) 1, 3, 4 డి) 1, 2, 3, 4

**7. కింది వాక్యాల్లో సరైనవి ఏవి?**
ఎ) శ్రీలంక 16వ మహిళా ప్రధానమంత్రిగా హరిణి అమరసూరియా నియమితులయ్యారు
బి) శ్రీలంక తొలి మహిళా ప్రధానిగా సిరిమావో బండారనాయకే 1960లో 6వ ప్రధానిగా ఎన్నికయ్యారు
సి) చంద్రిక కుమారతుంగ 11వ ప్రధానిగా 1994లో ఎన్నికయి 2 నెలల 24 రోజులు పనిచేశారు
డి) పైవన్నీ సరైనవే

**8. కింది వాక్యాల్లో సరైనవి ఏవి?**
1. 45వ చెస్ ఒలింపియాడ్ హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో నిర్వహించారు
2. భారత్ తొలిసారి పురుషుల, మహిళల జట్లు స్వర్ణాలు గెలిచాయి
3. గ్రాండ్ మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలి, అంతర్జాతీయ మాస్టర్లు దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్, తానియా సచ్‌దేశ్‌లతో కూడిన భారత మహిళల జట్టు 3.30.5 తేడాతో అజర్‌బైజాన్ జట్టును ఓడించి స్వర్ణం సాధించారు
4. మాస్టర్లు ఇరిగేశి అర్జున్, దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతి, పెంటేల హరికృష్ణలతో కూడిన భారత పురుషుల జట్టు 21 పాయింట్లతో పసిడిని సొంతం చేసుకుంది. చివరిదైన 11వ రౌండ్‌లో భారత్ 3.50.5 తేడాతో స్లొవేనియా జట్టును ఓడించి పసిడిని గెలుచుకుంది
ఎ) 2, 3, 4 బి) 1, 2, 4
సి) 1, 3, 4 డి) 1, 2, 3, 4

**9. భారతదేశంలో జాతీయ పార్టీలు ఎన్ని?**
ఎ) 9 బి) 6 సి) 8 డి) 7

**10. కిందివాటిలో జాతీయ పార్టీ కానిది ఏది?**
ఎ) బీఎస్పీ బి) సీపీఐ(ఎం)
సి) ఆమ్‌ఆద్మీ డి) సీపీఐ

**11. దేశ ప్రజలంతా ఏకకాలంలో లోక్‌సభకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్ని సార్లు ఓటు వేశారు?**
ఎ) 3 బి) 4 సి) 5 డి) 6

**12. వెల్లుల్లి కూరగాయ అని ఏ హైకోర్టు తీర్పు ఇచ్చింది?**
ఎ) ముంబై బి) లక్నో
సి) జబల్‌పూర్ డి) సిమ్లా

**13. చట్ట సభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ ఏది?**
ఎ) 128 బి) 121
సి) 124 డి) 126

**14. 2023-24లో జీడీపీలో తెలంగాణ వాటా ఎంత?**
ఎ) 4.9% బి) 4.7%
సి) 4.5% డి) 4.2%

**15. ఇటీవల పేటోంగ్ టార్న్ షినవత్ర ఏ దేశానికి ప్రధానిగాఎన్నికయ్యారు?**
ఎ) థాయిలాండ్ బి) ఫిలిప్పీన్స్
సి) ఇండోనేషియా డి) కంబోడియా

**16. 2024, ఆగస్ట్ 28 నుంచి పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో ప్రారంభోత్సవంలో భారత పతాకధారులు ఎవరు?**
ఎ) సుమిత్ అంటిల్
బి) భాగ్యశ్రీ జాదవ్
సి) ఎ సరైనది డి) ఎ, బి సరైనవి

**17. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి భాధ్యతలు చేపట్టిన తర్వాత ఎంత మందికి భారత రత్న అవార్డులను ప్రకటించారు?**
ఎ) 8 బి) 7 సి) 6 డి) 10

**18. ప్రపంచంలో అత్యుత్తమ విమానాశ్రయం ఏది?**
ఎ) హమద్ (దోహ)
బి) చాంగి (సింగపూర్)
సి) ఇన్చేయాన్ (సియోల్)
డి) హనీదా (టోక్యో)

**19. రాష్ట్రీయ విజ్ఞాన్ పురష్కారాలకు సంబంధించి సరైనవి ఏవి?**
1. రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాల పేరిట నాలుగు రకాల అవార్డులను ప్రదానం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది
2. విజ్ఞాన్ రత్న, విజ్ఞాన్ శ్రీ, విజ్ఞాన్ యువ శాంతిస్వరూప భట్నాగర్, విజ్ఞాన్ బృంద అవార్డులుగా విభజించారు
3. రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాల్లో అత్యున్నతమైన విజ్ఞాన్ రత్నను తొలి అవార్డును గోవిందరాజన్ పద్మనాభన్ అందుకున్నారు
4. ఈ అవార్డుల్లో ఇద్దరు తెలుగు శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్ఎల్ కృష్ణమూర్తి, డాక్టర్ రాధాకృష్ణ గంటి విజ్ఞాన్ యువ శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు అందుకున్నారు.
ఎ) 2, 3, 4 బి) 1, 2, 4
సి) 1, 3, 4 డి) 1, 2, 3, 4

**20. కింది వాక్యాల్లో సరైనవి ఏవి?**
ఎ) జాతీయ అవయవదాన దినోత్సవం ఏటా ఆగస్ట్ 3న నిర్వహిస్తారు
బి) 2024లో అవయవ మార్పిడిలో తెలంగాణ ఉత్తమ రాష్ట్రంగా నిలిచింది
సి) ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ తెలంగాణ జీవన్‌దాన్ ఇన్‌చార్జి స్వర్ణలతకు జాతీయ పురస్కారం అందజేశారు
డి) పైవన్నీ సరైనవే

**21. రవి కోట ఏ రాష్ట్రానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు?**
ఎ) జార్ఖండ్ బి) ఛత్తీస్‌గఢ్
సి) అసోం డి) మేఘాలయ

**22. తెలంగాణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 'మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' అమల్లో ప్రథమ స్థానంలో ఉన్న జిల్లా?**
ఎ) సూర్యాపేట బి) వికారాబాద్
సి) రంగారెడ్డి డి) నల్లగొండ

**23. 67వ మొక్కజొన్న పరిశోధన కేంద్రాల వార్షిక సమావేశం ఎక్కడ జరిగింది?**
ఎ) రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం
బి) బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాయం
సి) లూధియానా వ్యవసాయ విశ్వవిద్యాలయం
డి) జైపూర్ వ్యవసాయ విద్యాలయం

**24. 'సమూహార' యాప్ దేనికి సంబంధించింది?**
ఎ) తప్పిపోయిన పిల్లలను తక్షణం గుర్తించడానికి
బి) మహిళలు పనిచేసే స్థలాల్లో ఏవైనా ఇబ్బందులుంటే తక్షణం తెలియజేయడానికి
సి) కొత్త క్రిమినల్ చట్టాల వివరాల గురించి తెలుసుకోవడానికి
డి) రైతులు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో తెలుసుకోవడానికి

**25. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం ఎప్పుడు ఏర్పడింది?**
ఎ) 2014 బి) 2018
సి) 2016 డి) 2019

**26. ఏ మంత్రిత్వ శాఖ ఇటీవల 'షీ బాక్స్ పోర్టల్'ను ప్రారంభించింది?**
ఎ) హోం మంత్రి
బి) మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి
సి) రక్షణ శాఖ మంత్రి
డి) ఆర్థిక శాఖ మంత్రి

**27. జాతీయ చిన్న పరిశ్రమలను గురించి సరైన వాక్యాలు తెలపండి?**
1. జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం ఏటా ఆగస్ట్ 30న నిర్వహిస్తారు
2. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీలో వీటి వాటా 30.1%
3. ఎగుమతుల్లో జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాటా 45.73%
4. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కేంద్రమంత్రి జీతన్ రామ్ మాంఝీ
ఎ) 2, 3, 4 బి) 1, 2, 4
సి) 1, 3, 4 డి) 1, 2, 3, 4

**28. పెట్టుబడి, యంత్రాలు లేదా పరికరాలు, టర్నోవర్ ఆధారంగా జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభజనకు సంబంధించి సరైనవి ఏవి?**
ఎ) రూ.కోటి లోపు పెట్టుబడి, టర్నోవర్ రూ.5 కోట్ల లోపు ఉన్న పరిశ్రమలు సూక్ష్మ పరిశ్రమలు
బి) రూ.10 కోట్ల లోపు పెట్టుబడి, టర్నోవర్ రూ.50 కోట్ల లోపు ఉన్న పరిశ్రమలు చిన్నతరహా పరిశ్రమలు
సి) రూ.50 కోట్ల లోపు పెట్టుబడి, టర్నోవర్ రూ.250 కోట్ల లోపు ఉన్న పరిశ్రమలు మధ్యతరహా పరిశ్రమలు
డి) పైవన్నీ సరైనవే

**29. జాతీయ క్రీడా దినోత్సవం గురించి సరైన వాక్యాలు ఏవి?**
ఎ) మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం ఆగస్ట్ 29ని క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తారు
బి) 2012లో ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించారు
సి) ధ్యాన్‌చంద్ 1928, 1932, 1936 లో ఒలింపిక్స్ హాకీల్లో స్వర్ణ పతకాలు గెలవడంలో కీలకపాత్ర పోషించాడు
డి) పైవన్నీ సరైనవే

**30. 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి ఏమని ప్రకటించింది?**
ఎ) అంతర్జాతీయ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ సంవత్సరం
బి) ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో ఆపరేటివ్
సి) ఎ డి) ఎ, బి

**31. క్యాలెండర్ సంవత్సరంలో నిర్వహించే మొదటి ఓపెన్ టెన్నిస్?**
ఎ) ఆస్ట్రేలియన్ బి) వింబుల్డన్
సి) ఫ్రెంచ్ డి) యూఎస్

**32. 2024 ఏ ఓపెన్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న గెలిచాడు?**
ఎ) ఆస్ట్రేలియన్ బి) వింబుల్డన్
సి) ఫ్రెంచ్ డి) యూఎస్

**33. ఇటీవల కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్ కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు జిల్లాలతో కలిపి మొత్తం ఎన్ని జిల్లాలు ఉన్నాయి?**
ఎ) 8 బి) 6 సి) 9 డి) 7

**సమాధానాలు**

| | | | |
|---|---|---|---|
| 1-డి, | 2-ఎ, | 3-డి, | 4-డి, |
| 5-డి, | 6-డి, | 7-డి, | 8-డి, |
| 9-బి, | 10-డి, | 11-బి, | 12-సి, |
| 13-ఎ, | 14-ఎ, | 15-ఎ, | 16-డి, |
| 17-డి, | 18-ఎ, | 19-డి, | 20-డి, |
| 21-సి, | 22-బి, | 23-ఎ, | 24-సి, |
| 25-ఎ, | 26-బి, | 27-డి, | 28-డి, |
| 29-డి, | 30-డి, | 31-ఎ, | 32-ఎ, |
| 33-డి | | | |

అనంతారపు కృష్ణయ్య,
డైరెక్టర్,
శ్రీసాయి కోచింగ్ సెంటర్,
కోదాడ,
9948750605

